క్లుప్తంగా

రూ.60 వేల విరాళం అందజేత



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయం పక్కనే అయ్యప్పస్వామి సన్నిధానం నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి శాశ్వత సభ్యత్వం కలిగిన మాలధారులు ఇప్పటివరకు రూ.ఆరు లక్షల అందించారు. ఇంకా నిర్మాణ, ఇతర పనుల కోసం గురువారం గురుస్వాములు మరో రూ.60,464 కమిటీ సభ్యులకు అందించారు. వారిలో గురుస్వాములు కాశీపతి, శ్రావణ్, భావన్న, నరేష్, వెంకటేష్, సాయిబాబు, రాజు, భక్తులు సురేష్, తదితరులు ఉన్నారు.

పరామర్శ



కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని జేఎన్టీయూ మెట్రో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మాజీ శాసన సభ్యుడు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో వామన్‌గౌడ్, గాడీల ప్రశాంత్, జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు



భూమిక (ఫైల్)

పాన్‌గల్: వివాహిత అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన బంకల బాబుకు నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండలం సింగాయిపల్లికి చెందిన పూర్ణకంటి సింగోటి చిన్న కూతురు భూమికతో గత నెల 2వ తేదీన వివాహమైంది. బండపల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి భార్య, భర్తలు ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 8న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భూమిక నిద్రపోయింది. మరుసటి రోజు 9వ తేదీ ఉదయం నుంచి భూమిక కన్పించడం లేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భూమిక భర్త బాబు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గోపాలపేట మండలంలో దొంగల హల్‌చల్



గోపాల్‌పేట: మండలంలో గుర్తుతెలియని దుండగులు దొంగతనాలకు ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. బుధవారం రాత్రి గోపాల్‌పేట మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి ఓ ఇంటి తలుపును పగలగొట్టేందుకు ప్రయత్నించాడు. అదే ఇంట్లో కిరాయికి ఉంటున్న వారు చప్పుడు విని బయటికి రాగా.. తన వెంట తెచ్చుకున్న కొడవలి, ఇనుపరాడ్డు అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఇదిలా ఉండగా బుద్దారం గ్రామంలో ఈ నెల 10న రాత్రి సమయంలో తాళాలు వేసిన నాలుగు ఇళ్ల తాళాలను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టారు. గురువారం బుద్దారం గ్రామానికి చెందిన వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఏది ఏమైనా గ్రామాల్లో రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ పెంచాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

తొలగనున్న తాగునీటి కష్టాలు

కొల్లాపూర్ రూరల్: మున్సిపాలిటీలోని 5వ వార్డులో నివాసం ఉంటున్న ఐదు కుటుంబాల వారికి ఇప్పటివరకు తాగునీటి నల్లా కనెక్షన్ లేదు. నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహముదా బేగం స్పందించి సొంత ఖర్చులతో మంత్రి జూపల్లి సహకారంతో ఐదు కుటుంబాల వారికి సమీపంలో ఉన్న ఈదమ్మ బావి నుంచి తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఖాదర్ పాషా తదితరులు ఉన్నారు.



మానసిక ఆరోగ్యంపై జాగ్రత్త



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: పిల్లల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సూచించారు. గురువారం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉంచాలని, ఎవరికైనా లోపాలు ఉంటే.. మానసిక వైద్య నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పించాలని కోరారు. వాల్‌పోస్టర్లను అన్ని విద్యాసంస్థల వద్ద ఏర్పాటు చేయటంతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, వైద్యులు తదితరులు పాల్గొన్నారు

ఈనెల 14న హాస్టళ్లలో అవగాహన

ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన ఆయా హాస్టళ్లు, గురుకులాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం ఈ విషయమై కలెక్టరేట్ నుంచి ఆయా హాస్టల్, గురుకులాల పర్యవేక్షణ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. మెస్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెరిగాయన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల కుటుంబ సభ్యులను ఆహ్వానించాలన్నారు.

ఈనెల 17 నుంచి జిల్లాస్థాయి క్రీడలు

ఈనెల 17న తేదీ నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామ, మండల స్థాయిలో క్రీడా పోటీలు పూర్తయ్యాయని, అక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో డిసెంబర్ 17, 18, 19 తేదీల్లో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పాల్గొంటారని, ప్రతిభ చూపించిన వారు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికవుతారన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ యాదయ్య, డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, డీపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అభివృద్ధి శూన్యం



చిన్నంబావిలో బైక్ ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు



కొత్తకోటలో బూత్ కమిటీ సభ్యులతో బీజేపీ కౌన్సిలర్ భరత్‌భూషణ్

చిన్నంబావి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అభివృద్ధి జరిగింది మాత్రం శూన్యం అని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధారాసింగ్, మండల అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. కొల్లాపూర్‌లో జరిగే బీజేపీ బహిరంగ సభకు మండలం నుంచి బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా విజయోత్సవాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరు గ్యారంటీలు, అరవై హామీలతో ప్రజలను మభ్యపెట్టారని, పేదల బతుకులు మార్చాలి తప్పా విగ్రహాలను మారిస్తే అభివృద్ధి జరిగినట్టు కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ముఖచిత్రం చిన్నాభిన్నం అవుతుందన్నారు. భవిష్యత్‌లో బీజేపీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ మల్లికార్జున్, గోపినాయుడు, చెన్నయ్య, సాయిప్రణీత్‌గౌడ్, పురేందర్‌గౌడ్, జానీ, కురుమయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

కొత్తకోట: మున్సిపాలిటీలోని 235 బూత్, 11 వార్డులో బీజేపీ నూతన బూత్ కమిటీని సభ్యత్వాల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఓబీసీ మోర్చా స్టార్ బాలు, రాజారాంయాదవ్ ఆధ్వర్యంలో బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కౌన్సిలర్ భరత్‌భూషణ్ తెలిపారు. నూతన బూత్ కమిటీ అధ్యక్షుడిగా నందిమల్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా అల నరసింహారెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా చీర్ల ప్రశాంత్‌సాగర్, లాబర్ధి ప్రముఖ్‌గా చంద్రకంటి బాలకృష్ణ, మన్‌కీ బాత్ ప్రముఖ్‌గా పీజీ మహేష్ యాదవ్, బీఐఏ ప్రముఖ్‌గా నందిమళ్ల వెంకటేష్, మందగిరి చెన్నకేశవులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మధ్యమోని ఆంజనేయులు, పెంటన్నయాదవ్, గట్టన్న, మందగిరి కురుమూర్తి, మందడి రాజు, చంద్రకంటి రవికుమార్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో పూజలు



పాన్‌గల్: మండల కేంద్రంలో గీతా జయంతి వేడుకలను గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత శ్లోకాలు ఆలపించి వాటి భావాలు వివరించారు. ఈ సందర్భంగా పోతులమడుగు సీతారామ ఆంజనేయ ఆశ్రమం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ్రమం పీఠాధిపతి పూజ్యశ్రీ తిరుపతి తీర్థానంద స్వామి, ఆశ్రమం ఉత్తర పీఠాధిపతి పూజ్యశ్రీ వెంకట్ చరణ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: రాష్ట్రప్రభుత్వం విద్యారంగంపై దృష్టి సారించాలని, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా సిరాజుద్దీన్, అధ్యక్షుడిగా రియాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా సత్యమ్మ, కిరణ్, ప్రధానకార్యదర్శిగా సురేష్, సహాయకార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా సల్మాన్, సభ్యులుగా నాగరాజు, ఆఫ్రీన్‌బేగం, ఫారూఖ్, అలీమ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

పాన్‌గల్: అన్ని గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఏర్పాటు చేయాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల నిర్ధారణపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఎంపీడీఓ గోవింద్‌రావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 256 వార్డులకు 256 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, నాయకులు వెంకటయ్యనాయుడు, బాల్యానాయక్, బ్రహ్మయ్య, ప్రేమ్‌కుమార్, నరేందర్‌గౌడ్, వహీద్, నవీన్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం జనవరి, ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాలో పేర్లు మార్పులతో పాటు గ్రామాల్లో పోలింగ్ నిర్వహణపై తీసుకునే జాగ్రత్తలపై చర్చించినట్లు తెలిపారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన అంగన్‌వాడీలు



పాన్‌గల్: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు గురువారం మండలం నుంచి అంగన్‌వాడీలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు రాధ, శారద మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఐసీడీఎస్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు మండలం నుంచి ధర్నాకు తరలివెళ్లినట్లు వారు పేర్కొన్నారు.

దివ్యఖురాన్ సర్వమానవాళికి మార్గదర్శకం



హాఫీస్‌సాబ్‌లను సన్మానిస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: దివ్యఖురాన్ సర్వమానవాళికి మార్గదర్శకమని, ప్రతినిత్యం ఖురాన్‌ను పఠించాలని మౌలానాలు వాహేద్‌సాబ్, జియాఉర్‌రహ్మాన్ ఫహీమ్, షేఖ్ రఫియోద్దీన్, ముక్తార్ అన్నారు. గురువారం స్థానిక ఇమాదుల్ ఉలూమ్ మదర్సా మసీదులో ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇక్కడి అరబ్బీ పాఠశాలలో 65 మంది హాఫీసే ఖురాన్‌లు అయ్యారని, రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి కేవలం 8 నెలల వ్యవధిలో విద్యార్థి షాజహాన్ ఖురాన్ పఠనం పూర్తి చేశాడని తెలిపారు. అలాగే విద్యార్థులు సల్మాన్, మహమ్మద్ అలీ ఖురాన్ పఠనం పూర్తి చేయడంతో పూలమాలలతో సత్కరించారు. 2025 జనవరి 14న పాఠశాల వార్షికోత్సవం ఉంటుందని, అధిక సంఖ్యలో హాజరై సమావేశం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో షబ్బీర్, మహ్మద్, కలీం, అన్వర్, హనీఫ్, ఇస్మాయిల్, సాధిఖ్, ఫిరోజ్, మహమ్మద్‌రఫీ, ముస్లింలు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు రికార్డులను సిద్ధం చేయాలి

పాన్‌గల్: ఈనెల 14న మండలానికి సోషల్ ఆడిట్ టీం వస్తున్నందున అందుకు సంబంధించిన పూర్తి రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గోవింద్‌రావు సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిసెంట్లు, మేట్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు గ్రామాల వారీగా నిర్వహించిన పనులకు సంబంధించి అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. దీంతో పాటు నర్సరీల్లో మొక్కలు పెంచేందుకు కవర్లల్లో మట్టి నింపడం పూర్తి చేసి విత్తనాలు నాటాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఎంపీఓ రఘురాములు, ఈసీ అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బయటి ఆహారం తినొద్దు



విద్యార్థులకు ఐరన్ మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: విద్యార్థులు బయటి ఆహారాన్ని తినొద్దని, కలుషిత ఆహారంతో అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య ఉపాధ్యాయులకు సూచించారు. అనిమీయా ముక్త్ భారత్‌లో భాగంగా గురువారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నివారణ, చేతులు శుభ్రం చేసుకోవడం, పౌష్టికాహారం, బయటి మార్కెట్ తినుబండరాల నివారణపై అవగాహన కల్పించారు. బయట కిరాణం షాపుల్లో లభించే కురుకురేలు, లాలిపాప్‌లు, లేస్, చిప్స్ తినడంతో అనారోగ్యాంపాలవుతారన్నారు. పండ్లు, బెల్లం, నువ్వుల పట్టీలను మాత్రమే తినాలని సూచించారు. రక్తహీనత నివారణ కోసమే ఐరన్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు మైథిలి, తారాశంక్, హెచ్‌ఎం కురుమూర్తి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేష్

అమరచింత: సీసీ కెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించే అవకాశం ఉందని ఎస్‌ఐ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో గురువారం సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమనే విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చోరీలు, హత్యలు, అసాంఘిక కార్యక్రమాల వంటి వాటిని జరిగినప్పుడు సీసీ కెమెరాల ఉన్నట్లయితే నిందితులను గుర్తించవచ్చన్నారు. గ్రామంలోని చౌరస్తాలతో పాటు ప్రధాన రహదారులు, పాఠశాలలు, ఆలయాలు, ప్రార్థన మందిరాలు ఉన్న ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని కోరారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాలో..

పాన్‌గల్: అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించే విధంగా ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా మండలంలో సర్వే కొనసాగుతుందని ఎంపీడీఓ గోవింద్‌రావు గురువారం తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలనలో 13,540 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వాటి ఆధారంగా గ్రామాల వారీగా అర్హులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేసి, వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు.

గోపాల్‌పేట: పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు గ్రామాల్లో అర్హులను గుర్తించేందుకు సర్వే కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని హనుమాన్లగడ్డ కాలనీలో గురువారం పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపట్టారు. సర్వే జరుగుతున్న తీరును కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, జిల్లా ఆర్టీఐ చైర్మన్ కొంకి రమేష్, చంద్రశేఖర్, బాలపీరు, వెంకటయ్య, ధన్వాడ నాగరాజు తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



ఆత్మకూర్‌లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. రెండు రోజులుగా పట్టణంలోని బాలుర హైస్కూల్ మైదానంలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుకేశిని బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంఈఓ కృష్ణయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, ఎంజే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, కౌన్సిలర్ నారాయణమ్మ, మున్సిపల్ మేనేజర్ రవీందర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన పోటీలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన జట్లకు తహసీల్దార్ సర్వసతి, వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారని ఎంఈఓ బాణం విష్ణు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, రవి, నరేష్, ఎంపీఓ పుష్ప, హెచ్‌ఎం శాంతన్న, క్రీడల నిర్వాహకులు మన్యం, ఫిజికల్ డైరెక్టర్లు రవికుమార్, అనిల్ కుమార్, కిషోర్, వెంకటస్వామి, మంజుల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: సీఎం కప్ ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ భాస్కర్ సింగ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, ఎంపీఓ నరసింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతర మైదానంలో..

ఆత్మకూర్: స్థానిక జాతరమైదానంలో సీఎం కప్ క్రీడలు ఘనంగా ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పుర చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు, కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, ఫిజికల్ డైరెక్టర్లు సంతోష, వెంకట్, మహేష్, ప్రేమ్‌కుమార్, కోచ్‌లు అబ్దుల్‌ఖాదర్, రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అమరచింతలో..



పెద్దమందడిలో..

'ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: నియోజవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని విమర్శించే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదని కొత్తకోట తాజా మాజీ ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. మండల పరిధిలోని నాటవెల్లి మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎద్దుల నాగేష్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వరిధాన్యం తీసుకొచ్చి నాటవెల్లి కొనుగోలు కేంద్రంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచారని, బోనస్ కాజేసుందుకు పాల్పడ్డాడంటూ ఆరోపిస్తూ అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్‌ను గురువారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషి ఫలితంగానే వడ్డెవాటతండా నూతన గ్రామ పంచాయతీగా అవతరించిందని, అదేవిధంగా కనిమెట్ట, పాతజంగమాయపల్లి గ్రామాల మధ్య వాగుపై వంతెన, పామాపురం, వీరరాఘాపూర్ గ్రామాల మధ్య వంతెన, అప్పరాల-తిప్పుడంపల్లి గ్రామాల మధ్య వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఆకుల శ్రీనివాసులు, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, రాములుయాదవ్, గోపాల్‌నాయక్, కె.శ్రీనివాస్‌జీ, అయ్యన్న, శంకర్ నాయుడు, నెహ్రూ, నాగేష్‌రెడ్డి ఉన్నారు.

అరెస్టులతో భయపెట్టలేరు

ఐదేళ్ల పాటు తాను సర్పంచ్‌గా, మరో ఐదేళ్ల పాటు తన భార్య నాటవెల్లి గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించామని మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్ అన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక గ్రామంలో కొందరు కక్ష గట్టి కుట్రలు చేస్తూ.. వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచానని ఆరోపిస్తున్నారని ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులతో తనను భయపెట్టలేరన్నారు. గడిచిన 10ఏళ్ల పాటు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. కాంగ్రెస్ నాయకులు వత్తిడికి తలొగ్గి పోలీసులు తనను అక్రమంగా అరెస్టు చేశారని వాపోయారు.

చెరువు కాల్వలో పూడిక, ముళ్లపొదలు



చెరువుకు నీటిని తరలించే కాల్వ దుస్థితి

అమరచింత: 15 ఏళ్ల క్రితం అమరచింత పెద్ద చెరువును లిఫ్టు నీటితో నింపి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పంతో నిర్మించిన చెరువు కాల్వ నేడు పూడుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత లిఫ్టు నుంచి పెద్ద చెరువును నీటితో నింపాలని అప్పట్లో ఎంపీ విఠల్‌రావు, ఎమ్మెల్యే స్వర్ణమ్మ నిధుల ద్వారా కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో పాటు పనికి ఆహారం పథకం ద్వారా మరోమారు నిధులు మంజూరు కావడంతో పూర్తి స్థాయిలో కాల్వను నిర్మించారు. కానీ 12 ఏళ్లుగా లిఫ్టు నుంచి చెరువు కాల్వకు సాగునీరు వదలకపోవడం, ఐడీసీని తొలగించి ఇరిగేషన్ శాఖకు అప్పగించడంతో వీటి నిర్వహణ మరిచిపోయారు. దీంతో కాల్వలో భారీ చెట్లతో పాటు ముళ్లపొదలు పెరిగి కాల్వను కమ్ముకున్నాయి. సాగునీటి కోసం ఖర్చుపెట్టిన సుమారు రూ.20 లక్షలు మట్టిలో కలిసిపోయాయని రైతన్నలు ఆరోపిస్తున్నారు.